క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న కోరమాండల్ సంస్థ ప్రతినిధులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీ ఎస్పీ జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు సుమారు వంద మందికి కోరమాండల్ సహకారంతో బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ గాయత్రి, అధ్యాపకుడు పాల్‌రాజు అభ్యర్థన మేరకు వీటిని సమకూర్చినట్టు కోరమాండల్ ప్రతినిధి జగన్నాథన్ తెలియజేశారు. సీఎ స్సార్ నిధుల నుంచి రూ.లక్షతో వీటిని పంపిణీ చేసినట్టు తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలో పారిశుధ్య పనులను డీఎల్‌డీఓ వాసుదేవరావు బుధవారం పరిశీలించారు. గ్రామంలో ఇంటింటి నుంచి సిబ్బంది సేకరిస్తున్న తడి, పొడి చెత్తను ఆయన పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆయనతో డిప్యూటీ ఎంపీడీఓ సీతారామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

తొలి వాస్తు శిల్పి విశ్వకర్మ



విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రపంచ తొలి వాస్తు శిల్పిగా విరాట్ విశ్వకర్మ గుర్తింపు పొందారని కలెక్టర్ షణ్మోహన్ సగిలి పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో విరాట్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు హాజరై విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎం.లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుగుదురులో..



పెనుగుదురులో విశ్వకర్మ భగవాన్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న సంఘ నాయకులు, గ్రామస్తులు

కరప: మండలం పెనుగుదురులో బుధవారం విశ్వకర్మ భగవాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ యువ సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మోజు శ్రీనివాస్, కోచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సృష్టికి మూలపురుషుడు విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. బండారు సతీష్, బండారు మురళి, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

కరప: మండలం గొర్రిపూడిలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మండల బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షురాలు యర్రంనీడి పద్మావతి ఆధ్వర్యంలో అందరికీ స్వీట్లు పంచారు. అనంతరం నడకుదురులోని జనావళి వృద్ధాశ్రమంలో స్వీట్లు, పండ్లు, రొట్టెలు అందజేశారు. బీజేపీ నాయకులు బులిశెట్టి రామకృష్ణ, పుట్టా వీరప్రసాద్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే అనుకున్నది సాధించవచ్చు

బోట్‌క్లబ్: కష్టపడితే అనుకున్నది సాధించవచ్చునని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. డీఎస్సీలో 90వ ర్యాంకు సాధించి మున్సిపల్ పరిధిలో ఉపాధ్యాయునిగా ఎంపికైన ఈతకోట నానాజీని బుధవారం ఆయన సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షురాలు గోడి సత్యవతి, బీజేపీ నాయకులు గోడి వెంకట్, సోమిశెట్టి నాగేశ్వరరావు, ఈతకోట నిహారిక పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో లేఖర్ల పెన్‌డౌన్

కాకినాడ లీగల్: ఆన్‌లైన్ దస్తావేజు రిజిస్ట్రేషన్ విధానంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 19, 20 తేదీల్లో కాకినాడ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేస్తున్నట్లు సంఘం కాకినాడ అధ్యక్షుడు చోడపునీడి గోవిందరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ దస్తావేజుల రిజిస్ట్రేషన్ల సమయంలో ఆధార్ కార్డు, ఓటీపీ, ఆటో మ్యూటేషన్ వల్ల ప్రజలు, డాక్యుమెంటు రైటర్లు ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇలాగైతే బుక్కయినట్టే!

- పుస్తక ప్రియుల నెత్తిన పోస్టల్ పిడుగు
- సర్వీసుల ధరలు భారీగా పెంపు
- కాంప్లిమెంటరీలపైనా అదనపు సుంకం
- అన్యాయమంటున్న వినియోగదారులు

బాలాజీచెరువు: ఉత్తరాలు, మనియార్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలాశాఖ తాజాగా పుస్తక ప్రియులకు భారీగా షాక్ ఇచ్చింది. ఇంతకాలం బుక్‌పోస్టు సర్వీస్ పేరుతో అతితక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా ఆ సేవల చార్జీలను పెంచారు. ఈ మార్పు పుస్తకాలతో పాటు దిన, పక్ష పత్రికల బట్వాడాపై తీవ్ర ప్రభావం చూపనుంది.

కొరియర్ సేవలతో పోలిస్తే..

ప్రైవేట్ కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఇప్పటి వరకూ తపాలాశాఖ చాలా తక్కువ ధరలు వసూలు చేస్తూ పార్శిళ్లను తరలిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రైవేట్ కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్‌కు గతంలో రూ.80 చెల్లించేవారమని, ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ.356 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ప్రచురణ రంగంలో ప్రకంపనలు..

ఈ విధానం ప్రచురణ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. రిజిస్టర్ బుక్ పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీస్‌ను తపాలాశాఖ రద్దు చేయడంతో తప్పని పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పోస్టులో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువచేసే పుస్తకాన్ని పాఠకులు పోస్టల్ శాఖ ద్వారా తెప్పించుకోవాలంటే పుస్తకం వెల రూ.100తో పాటు మరో రూ.80 చార్జీ భరించాల్సి ఉంటుంది.

ఐదు శాతం దిగుమతి సుంకం

కేంద్రం తీసుకున్న మరో నిర్ణయంతో పాఠకుల నుంచి విమర్శలు వ్యక్తమౌతున్నాయి. శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లో అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి సుంకం విధించడం సమర్థనీయమే అయినా కాంప్లిమెంటరీ పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం తగదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతోంది.



తపాలా కార్యాలయం

పెరిగిన ధరలు ఇలా..

బుక్‌పోస్టు బరువు గ్రాములలో	పాత ధర రూ.లలో	కొత్త ధర రూ.లలో
100	22	28
1000	27	92
2వేలు	43.50	163
3వేలు	56.40	234
4వేలు	67	304
5వేలు	79	365

పుస్తక పఠనాన్ని దూరం చేయడమే..



ధరల పెంపుతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి ధరలు పెంచితే పుస్తకాలు కొనేవారు తగ్గిపోతారు. ఇప్పటికే డిజిటలైజేషన్ తరుణంలో పాఠకుల సంఖ్య తగ్గుతుంది. ఈ విధానంతో వాటి మనుగడ తగ్గుతుంది.

– కె.సాయిబాబు, గ్రంథాలయాధికారి, కాకినాడ

ఉచిత కంటి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వీసీ ప్రసాద్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం కిరణ్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్ చంద్రశేఖర్ ప్రారంభించగా వర్సిటీ వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ తొలుత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డిసెంబర్ 31వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకూ విద్యార్థులతో పాటు సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ మోహనరావు, వైద్యులు సత్యనారాయణ ఎన్.సుదీప్తి, ఫార్మాసిస్టు పి.శ్రావణి డిస్పెన్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఐదుగురికి ఐదు రోజులు చొప్పున, 17 మందికి రెండు రోజులు చొప్పున జైలు, 33 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం కోర్టులో 55 మందిని హాజరుపరచగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మొక్కలతో ఓజోన్ పరిరక్షణ

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో ఓఎన్‌జీసీ, అటవీ శాఖ సహకారంతో బుధవారం మొక్కలు నాటారు. సుమారు వంద మొక్కలను నాటేందుకు ఓఎన్‌జీసీ, అటవీ శాఖ ముందుకు రావడంతో ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా హరితహారం - గ్రీన్ కవర్ మొక్కలు నాటడం ప్రారంభించామని, వాటిని పెంచడం ద్వారా గాలిలో ఓజోన్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ కాకినాడ ప్రతినిధులు రవీంద్ర, సన్నీ చౌదరి, అటవీ శాఖ అధికారులు సత్య పద్మావతి, రవి, సరిబాల, అధ్యాపకులు మనోజ్ దేవా తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురం ఎంఎస్‌ఎన్ పీజీ సెంటరులో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ

రక్తదానం ప్రాణదానంతో సమానం

బోట్‌క్లబ్: రక్తదానం ప్రాణదానంతో సమానమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం కార్యకర్తలు, నాయకులు రక్తదానం చేశారు. వారం రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం రెడ్‌క్రాస్, రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో 82 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడా కృష్ణమోహన్, సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న నాయకులను అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

రమణయ్యపేటలో స్వచ్ఛ భారత్

అలాగే స్థానిక రమణయ్యపేటలో ఆ పార్టీ నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించి వీధులలో చెత్తను ఊడ్చారు.

వైభవంగా సీతారామ కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని బుధవారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం

బోట్‌క్లబ్: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని గాంధీనగర్ రైతుబజార్ సమీపంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం రాట ముహూర్తం చేశారు. మాజీ కార్పొరేటర్ దండుమహంతి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. అమ్మవారి ఆలయానికి సింహద్వారం చేయించేందుకు కర్రి చిన్నబాబు ముందుకు వచ్చారన్నారు. భక్తుల సహాయ సహకారాలతో వెండి కవచం, మకర తోరణం, ఇతర వస్తువులు సమకూర్చినట్టు ఆలయ ప్రధాన అర్చకులు శేషుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో వి.నాగేశ్వరరావు, శంకర్ నారాయణ, పి.నాగేశ్వరరావు, గుండు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో రాట ముహూర్తం చేస్తున్న నిర్వాహకులు

సత్యదేవ కాకినాడ జిల్లాగా నామకరణం చేయాలి

తాళ్లరేవు: కాకినాడ జిల్లాకు సత్యదేవ కాకినాడ జిల్లాగా నామకరణం చేయాలని వేద పండితుడు వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు) తదితరులు డిమాండ్ చేశారు. పిల్లంక గ్రామంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కాశిబాబు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ కోరిన కోర్కెలు తీర్చే అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఖ్యాతి దశదిశలా వ్యాపింపజేసేందుకు ఈ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తోలేటి శ్రీనివాస్, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.



పిల్లంకలో మాట్లాడుతున్న కాశిబాబు

గౌరవ వేతనాలు చెల్లించండి

- ఎంపీటీసీల డిమాండ్
- వివిధ శాఖల అభివృద్ధిపై మండల సమావేశంలో చర్చ

కరప: ఎంపీటీసీలుగా గెలుపొంది నాలుగేళ్లు అయిందని, మరో ఏడాదిలో తమ పదవీకాలం ముగుస్తుందని, తమకు గౌరవవేతన బకాయిలు చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌లు, సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని శాఖల వారీగా సమీక్షించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ వాహనమిత్ర పథకం కోసం ఆటో డ్రైవర్లు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే పీ-4 పథకం కింద 1970 కుటుంబాలను 1024 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే నానాజీ సమీక్షిస్తుండగా ఎంపీటీసీ సభ్యుడు చక్కపల్లి ఫకీర్రావు మాట్లాడుతూ మూడేళ్ల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలన్నారు. కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి కాకినాడ వెళ్లే బస్సులను ఆయా గ్రామాల్లో ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరపలో నక్కావారి ఎస్సీవీధిలో వంతెనను పునర్నిర్మించాలని, డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. వలసపాకల, అరట్లకట్ట సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, గోపి సత్యవేణి మాట్లాడుతూ వీధి లైట్లు మంజూరు చేయాలని, పాతర్లగడ్డ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, వేములవాడ పీఏసీఎస్ చైర్మన్ దూడల నారాయుడు గృహ రుణాలు మంజూరు చేయాలని కోరారు.

వేళంగి పీహెచ్‌సీ అధికారి పీవీ రమణారావు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య మాట్లాడుతూ ఈ నెలాఖరుకల్లా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేస్తామని, యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎంఈఓ పి.సత్యనారాయణ మాట్లాడుతూ మండలానికి 30 టీచర్ల పోస్టులు మంజూరయ్యాయన్నారు. అలాగే విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు వారివారి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం, డిప్యూటీ తహసీల్దార్ జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో వ్యవసాయశాఖ ప్రగతిని వివరిస్తున్న ఎంఏఓ సత్య

‘ఆంధ్ర యువ సంకల్ప్ 2కే25’కు ఆహ్వానం

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను భాగస్వామ్యం చేస్తూ ‘ఆంధ్రా యువ సంకల్ప్ 2కె25 డిజిటల్ మారథాన్’ ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు సెట్రాజ్ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సీఈవో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికసిత్ భారత్-2047కు అనుగుణంగా సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్, డిజిటల్ ఇన్నోవేషన్, ఏఐ టెక్నాలజీ, స్మార్ట్‌యూత్ ఏపీ విభాగాలుగా ఈ మూడు విషయాలపై యువత వీడియోలను తయారు చేయాలన్నారు. ఇందులో పాల్గొనే యువతకు మార్గదర్శకాలు సూచించారు. 18 నుంచి 35 మధ్య వయసు లోపు వారై ఉండాలని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆంధ్రయువసేనకల్ప్.కామ్‌లో రిజిస్టర్ అవ్వాలన్నారు. వారు తయారు చేసిన 120 సెకండ్ల నిడివి గల వీడియో/షార్ట్‌లను వారి సొంత సోషల్ మీడియాలో అధికారిక హాష్‌ టాగ్‌లతో పోస్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, 9 మంది విజేతలను ‘ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 అంబాసిడర్లుగా సత్కరిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యువత ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25-డిజిటల్ మారథాన్’లో ఎక్కువ మంది యువత పాల్గొనాల్సిందిగా సూచించారు.

స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ శిబిరాలు ప్రారంభం

కాకినాడ క్రైం: జిల్లాలో బుధవారం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ లాంఛనంగా ప్రారంభమైంది. కాకినాడలోని ప్రకాశం స్ట్రీట్ యూపీహెచ్‌సీలో సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంతో పాటు సచివాలయాలకు అనుబంధంగా ఉన్న వెల్‌నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్‌గా వి.అరుణ వ్యవహరించనున్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ కిరణ్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి అన్నారు. మండలం గురజనాపల్లిలో బుధవారం ఈ మేరకు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ఏంజిలిన్, డాక్టర్ సయ్యద్ ఖతీజా సత్తారి అఫ్రోజ్ మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్‌కు సంబంధించిన, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు వై.వీరవేణి, మామిడాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

వీఆర్‌ఏల సమస్యలపై ధర్నాకు సిద్ధం

పెద్దాపురం: గ్రామ రెవెన్యూ సహాయ అధికారులు (వీఆర్‌ఏ)ల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నుంచి 21వ తేదీ వరకు చేపట్టే ఆందోళనకు తాము సిద్ధంగా ఉన్నామని పెద్దాపురం వీఆర్వోల అసోషియేషన్ ప్రకటించింది. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా ధర్నా చేస్తున్నట్టు బుధవారం స్థానిక తహసీల్దార్, పోలీస్ అధికారులకు వీఆర్‌ఏలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ సంఘం నాయకులు దువ్వాపు వీరబాబు, సుందరపల్లి రామలింగేశ్వరారవు, నూకతట్టు వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలని, నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేపడతున్నామన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో స్థానిక తహసీల్దార్ కార్యాలయం, 20వ తేదీన ఆర్డీఓ కార్యాలయం, 21వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేపడుతుమన్నారు. వీఆర్‌ఏలు ప్రతీ ఒక్కరూ ఈ ధర్నా కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



శాంతియుత ధర్నాలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్‌గా చేద్దాం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుదామని రైల్వే డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీరు బి.శివప్రసాద్, స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. దీనిలో భాగంగా రైల్వే ప్రయాణికులకు క్లాత్ బాగ్‌లను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తయారు చేయాలన్నారు. అక్టోబరు 2 నుంచి రైల్వే స్టేషన్ ఆవరణలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, టీటీఐ చైతన్య, ఆర్పీఎఫ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు మహేష్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం వాహనాలు బారులు తీశాయి. బ్రిడ్జిపై అడుగు అడుగునా గోతులు ఉండడంతో వాహనాల యజమానులు గోతులను తప్పించుకొనే క్రమంలో ఎడమ వైపు నుంచి కుడి వైపునకు వస్తున్నారు. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలకు మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గత నెల రోజులుగా ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులను పూడ్చక పోవడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వర్షాలు కురియడంతో గోతులలో నీరు చేయడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. పెద్దాపురం -రాజానగరం ఏడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాల నుంచి వచ్చే బస్సులతో బ్రిడ్జి రద్దీగా ఉంటోంది. ఇటువంటి సమయంలో వాహనాలు నిలిచిపోవడంతో కళాశాల విద్యార్థులు రోడ్డుపైకి దిగడంతో చిన్న వాహనచోదకులు కూడా రాక పోకలు సాగించడానికి అవకాశం ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి.

భావితరాల కోసం నీటి వృథా అరికట్టాలి

సామర్లకోట: భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ నీటి వృథా అరికట్టడంపై దృష్టి సారించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాగునీటితో పాటు, సాగునీరు వృథాను అరికట్టడంతో పాటు, విద్యార్థులు చేతులను శుభ్రతపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ లక్ష్మీదుర్గ, శిరిష, బాలశైలజ, సైదున్నిషా బేగంలు పాల్గొన్నారు.